నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
13 హైదరాబాద్, మంగళవారం 30 జనవరి 2024 SANGAREDDY

# తల్లిపాలు పిల్లలకు అమృతం

**తెలంగాణలో 90శాతం ఆపరేషన్లు జరుగుతున్నాయి**

**సాధారణ డెలివరీల దిశగా అడుగులు వేయాలి**

**రామకృష్ణమఠం సేవలు అభినందనీయం**

**మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు**

**సిద్దిపేట విపంచి కళానిలయంలో గర్భిణులకు అవగాహన**

సిద్దిపేట, జనవరి 29 : తల్లిపాలు పిల్లలకు అమృతం లాంటివని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట విపంచి కళానిలయంలో శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. తల్లి గర్భంతో ఉన్నప్పుడు తీసుకునే ఆహారం పుట్టబోయే బిడ్డ మీద ప్రభావాన్ని చూపుతుందన్నారు. అమ్మ అంటే అందరికీ ఇష్టం... ఆ అమ్మను మరింత బలోపేతం చేసేందుకు రామకృష్ణ మఠం వారు ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి తల్లి తనకంటే అద్భుతమైన జీవితాన్ని బిడ్డ పొందాలని కోరుకుంటుందన్నారు. గులాబీ అధినేత కేసీఆర్ గర్భిణుల కోసం కేసీఆర్ కిట్ పథకం అమలు చేశారని గుర్తుచేశారు. గ్రామాల్లో ఉండే పేద మహిళలు పనులకు వెళ్లే క్రమంలో ఇబ్బంది పడుతున్నారని, గర్భంతో ఉన్న సమయంలో పనులకు వెళ్లొద్దని సూచించారు. హిందువులైతే భగవద్గీత చదవండి, సంగీతం విని మంచి పుస్తకాలు చదివించాలని, అది పుట్టబోయే బిడ్డపై ప్రభావం చూపుతుందన్నారు. అతి ఎక్కువగా (90 శాతం) సీ సెక్షన్ డెలివరీలు తెలంగాణలో జరుగుతున్నాయన్నారు. కానీ సాధారణ డెలివరీలో పుట్టే పిల్లలు చురుగ్గా ఉంటారన్నారు. మొదటి గంట తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ టీచర్లు ,ఆశ వర్కర్లు, హెల్త్ సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో 'ఆరోగ్యలక్ష్మి' కార్యక్రమం అమలు చేసి పాలు, కోడిగుడ్డుతో అన్నం వడ్డించామని గుర్తుచేశారు. కడుపులో బిడ్డ పడగానే ఐరన్ సిరప్‌లు, కేసీఆర్ న్యూట్రీషన్ కిట్స్ ఇచ్చామన్నారు. సాధారణ డెలివరీల కోసం గర్భిణులకు యోగా నేర్పించేందుకు ప్రతి ఎంసీహెచ్‌లో ట్రైనర్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు, రామచంద్ర మిషన్ వైద్యులు అనుపమ, నిహారిక, ఆమని, దీప్తితో పాటు మిషన్ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సిద్దిపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

**బీఆర్ఎస్ ప్రభుత్వంలో గర్భిణులకు కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్స్ అందజేశాం**


సిద్దిపేటలో అవగాహన కార్యక్రమానికి హాజరైన గర్భిణులు

# విజయఢంకా మోగించాలి

**ఎంపీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి**

**కాంగ్రెస్ అబద్ధాలను, బీఆర్ఎస్ అభివృద్ధిని ప్రజలకు వివరించాలి**

**మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి**

**అందోల్‌లో నియోజకవర్గ ఆత్మీయ సమావేశం**

**సర్పంచ్‌లకు సన్మానం..**

**మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు చెక్కులు పంపిణీ**


అందోల్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, చిత్రంలో ఎంపీ బీబీ పాటిల్, సంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంటిక్రాంతికిరణ్ తదితరులు

అందోల్, జనవరి 29 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించి విజయఢంకా మోగించాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. సోమవారం అందోల్ మండలం సంగుపేటలోని ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అందోల్ నియోజకవర్గ ఆత్మీయ సమావేశానికి ఎంపీ బీబీ పాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు. తెలంగాణ తెచ్చి, రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన పార్టీగా బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఎంతో ఆదరణ ఉన్నదని, దాన్ని ఓట్ల రూపంలో మలుచుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేసి లబ్ధి పొందిందని, ఆ పార్టీని గెలిపించినందుకు ప్రజలు ఎంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలు.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు, రైతులతో పాటు ప్రతి ఒక్కరికీ కష్టాలు మొదలయ్యాయని, కరెంట్ కోతలు, నీటి కష్టాలు ఇతర అంశాలను ఇంటింటికీ వివరించాలన్నారు. కేసీఆర్ లేని ప్రభుత్వంలో అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయని, అన్ని వర్గాలు పశ్చాతాప పడుతున్నారని వారిని కలిసి భరోసా కల్పించాలన్నారు. కాంగ్రెస్-బీజేపీలు అధికార కాంక్షతో పనిచేస్తున్నాయని, అలాంటి పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలన్నారు. ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత పదేండ్లుగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, వాటిని చూసే ప్రజలు మరోసారి పట్టం కడతారన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేసి జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ మంజు శ్రీజైపాల్‌రెడ్డి అన్నారు. బేషజాలు పక్కన పెట్టి కలిసికట్టుగా పని చేస్తే విజయం మనదేనన్నారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ అందోల్ నుంచి గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ అందించాలన్నారు. గ్రామ, మండల స్థాయిల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించాలన్నారు. ఓడినా గెలిచినా నిత్యం ప్రజల మధ్యే ఉంటామని, ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునేది కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ఒక్కటేన్నారు. అనంతరం నియోజకవర్గంలోని సర్పంచ్‌లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ప్రమాద బీమా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఎంపీపీ బాలయ్య, జడ్పీటీసీ రమేశ్, మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు సంజీవయ్య, మల్లికార్జున్, రజినీకాంత్, జోగినాథ్, నారాయణ, మాజీ ఎంపీపీ రామాగౌడ్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు రాహుల్ కిరణ్, ఉదయ్ బాబూమోహన్, లింగాగౌడ్, కాశీనాథ్, వీరభద్రరావు, శ్రీధర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.


అందోల్ ఆత్మీయ సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

# దళితబంధు నిధులు విడుదల చేయాలి

సిద్దిపేట, జనవరి 29: రెండో విడత మంజూరైన దళితబంధు నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని 23 గ్రామాలకు చెందిన 150 మంది లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ గరిమాఅగర్వాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బాలనర్సు, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పరశురాములు మాట్లాడుతూ రెండో విడతలో దళిత బంధు పథకం కింద మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్‌కు ముందు రూ.3 లక్షలు కలెక్టర్ అకౌంట్‌లోకి వచ్చాయని, మిగతా ఏడు లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు.


సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి నిరసన తెలుపుతున్న బెజ్జంకి మండల లబ్ధిదారులు

# నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా

*రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్*


అక్కన్నపేట: అంతకపేట- గుబ్బడి బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం

అక్కన్నపేట/ హుస్నాబాద్‌రూరల్, జనవరి 29: హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ కింద అక్కన్నపేట, రేగొండ , జనగామ గ్రామాల్లో రూ. 85 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకులు, గండిపల్లిలో రూ. 22లక్షలతో నిర్మించిన పల్లె దవాఖాన, అంతకపేటలో రూ.15 లక్షలతో నిర్మించిన మహిళా భవనం, రూ.5 లక్షలతో చేపట్టిన ఓపెన్ జిమ్ సెంటర్‌ను ప్రారంభించి, రూ. 1.50 కోట్లతో అంతకపేట-గుబ్బడి బీటీ రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. హుస్నాబాద్ మండలంలోని పందిల్లలో రూ. 22 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖాన, రాములపల్లి, వంగరామయ్యపల్లిలో రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలు, రూ. 47 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకులను ఆయన ప్రారంభించారు.కార్యక్రమాల్లో సిద్దిపేట జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, హుస్నాబాద్ ఆర్డీవో బెన్‌షాలోమ్, ఎంపీపీలు మాలోతు లక్ష్మీబీలునాయక్, లకావత్ మానస, జడ్పీటీసీ భూక్యా మంగ, సర్పంచ్‌లు సంజీవరెడ్డి, సృజనసంపత్, లావణ్య, మానస, నిర్మల, రమేశ్, మధన్ మోహన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.


అక్కన్నపేట: అంతకపేట మహిళా సంఘం భవనంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పొన్నం

# మూడు విడతల్లో ఇంటర్ ప్రాక్టికల్స్

*ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభం..*

*మెదక్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సత్యనారాయణ*

మెదక్, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 15 వ తేదీ వరకు మూడు విడుతల్లో ప్రాక్టికల్ నిర్వహించనున్నట్లు మెదక్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. జిల్లాలో సైన్స్ గ్రూపులకు సంబంధించిన ద్వితీయ సంవత్సరం 3594 మంది, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ప్రథమ సంవత్సరం 602 మంది, ద్వితీయ సంవత్సరం 528 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. జనరల్ ఒకేషనల్ గ్రూపుల కోసం 35 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు కనీసం అరగంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఫస్టియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 16వ తేదీన ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తామని, పరీక్షా సమయం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు. గత సంవత్సరం ఫస్టియర్‌లో నైతికత- మానవ విలువలు పరీక్ష ఫెయిల్ అయిన విద్యార్థులకు ఫిబ్రవరి 17వ తేదీన పరీక్ష ఉంటుందని, 19న ఫస్టియర్ విద్యార్థులకు పర్యావరణ విద్యా పరీక్ష నిర్వహిస్తామని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, తల్లిదండ్రులు ఈ విషయాలను గమనించి విద్యార్థులు పరీక్షలు రాసేలా చూసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా హైపవర్ కమిటీని ఇంటర్మీడియట్ బోర్డు నియమించింది. ఈ కమిటీలో ఎస్పీ, పోలీస్ కమిషనర్, ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సభ్యులుగా ఉంటారన్నారు. వీరితో పాటు అదనంగా డీసీ మెంబర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షా నిర్వహణను పర్యవేక్షిస్తుంటాయని తెలిపారు. హాల్ టికెట్ల జారీ విషయంలో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి

*సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి*

కొండపాక, జనవరి 29: గులాబీ అధినేత కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని సిద్దిపేట జడ్పీ చైర్మన్ వేలేటి రోజాశర్మ, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియనున్న సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఎంపీపీ ర్యాగళ్ల సుగుణ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధి గ్రామాల్లో చిరస్థాయిలో నిలిచిపోతుందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు కృషితో గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకునే అవకాశం దక్కడం అదృష్టమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్, సర్పంచ్‌ల ఫోరం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహదేవ్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు చింతల సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వాసరి లింగారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్, ఎంపీడీవో రాంరెడ్డి, సర్పంచ్‌లు చిట్టి మాధురి, పోల్కంపల్లి జయంతీనరేందర్, పిడిశెట్టి శ్రీనివాస్, అమ్ముల రమేశ్, మహిపాల్ పాల్గొన్నారు.


కొండపాకలో సర్పంచ్‌లను సన్మానించిన సిద్దిపేట జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు

# ఓటింగ్‌పై అవగాహన ఉండాలి

*మెదక్ కలెక్టర్ రాజర్షి షా*

మెదక్, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : పటిష్టమైన ప్రజాస్వామ్య పాలన నిర్వహించేందుకు, సమర్థవంతమైన ప్రజాప్రతినిధిని ఎన్నుకోవడం ఓటు ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని మెదక్ కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం డిమోన్‌స్ట్రేషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్వో పద్మశ్రీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరుకు ఓటు హక్కును వినియోగించుకునే సౌకర్యాలు కల్పించడమే కాకుండా ఓటింగ్ యంత్రాలపై సంపూర్ణ అవగాహన కల్పిస్తూ, వారిని రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం సిద్ధం చేసేలా ఈవీఎం, వీవీపాట్, కంట్రోల్ యూనిట్లతో కూడిన డిమోన్‌స్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెదక్, నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టరేట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో మొత్తం మూడు డిమోన్‌స్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నిరక్షరాస్యులు, వృద్ధులు, నూతన ఓటర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈవీఎం డిమోన్‌స్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి ఓటింగ్ యంత్రాలను పరిశీలించి ఓటు వేసే విధానాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా ఓటరు ఓటు హక్కును వినియోగించుకునే యంత్రాల గురించి సంపూర్ణ స్పష్టత, అవగాహన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ హర్దీప్ సింగ్, ఎలక్షన్స్ డీటీలు, ఇతర ఎలక్షన్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.


మెదక్ కలెక్టరేట్‌లో ఈవీఎం డిమోన్‌స్ట్రేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

# ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలి

*ఫిబ్రవరి 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం*

*సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి*


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 29 : నులిపురుగుల నివారణ మాత్రలు పకడ్బందీగా పంపిణీ చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా వైద్యారోగ్యశాఖ, అనుబంధ శాఖల అధికారులతో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 1 నుంచి 19 ఏండ్లలోపు ఉన్న 4లక్షల5వేల207 మంది పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఆ రోజు మాత్రలు తీసుకోని వారికి మళ్లీ 19వ తేదీన అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి, వైద్యాధికారులు డాక్టర్ శశాంక్, డాక్టర్ రాజేశ్వరి, విద్యా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా, శిశు సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ బల్దియా బీఆర్ఎస్ సొంతం


మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నాయకులు

**మున్సిపల్ చైర్మన్ పదవి ఏకగ్రీవం**

**దుర్గప్పగారి అశోక్‌గౌడ్ ఎన్నిక**

**బీజేపీ ఎత్తులు, కుట్రలను చిత్తు చేసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు**

**నూతన చైర్మన్‌కు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల శుభాకాంక్షలు**

నర్సాపూర్, జనవరి 29: నర్సాపూర్ గడ్డా బీఆర్ఎస్ అడ్డా అని మరోసారి రుజువైంది. బీజేపీ ఎత్తులు, కుట్రలను చిత్తు చేస్తూ అవిశ్వాసం నెగ్గి మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకుని కారు స్పీడును మరింత పెంచింది. రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీల్లో ప్రతిపక్షాలు అవిశ్వాసం పెట్టి అన్యాయంగా చైర్మన్ పదవులను లాక్కుంటుండగా, అందుకు విరుద్ధంగా నర్సాపూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో బీఆర్ఎస్ నుంచి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన మురళీయాదవ్ మధ్యలో బీజేపీ తీర్థం పుచ్చుకుని తన పదవికి రాజీనామా చేయకుండా చైర్మన్‌గా చలామణి అయ్యారు. ఇది జీర్ణించుకోలేని బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టాలని అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయడంతో అవిశ్వాసానికి ముందుగానే మురళీయాదవ్ రాజీనామా చేశారు. దీంతో మున్సిపల్ చైర్మన్ పదవికి ఎన్నిక అనివార్యమైంది. సోమవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. మొత్తం 15 మంది కౌన్సిలర్లుండగా ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. మిగతా 9 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్లు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు వెంకట్రామ్‌రెడ్డి, యాదవరెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్‌గా దుర్గప్పగారి అశోక్‌గౌడ్‌ని కౌన్సిలర్ రామ్‌చందర్ ప్రతిపాదించగా మరో కౌన్సిలర్ తంగెడుపల్లి సరిత ఆమోదించారు. మిగతా కౌన్సిలర్లు సైతం ఆమోదం తెలుపడంతో మున్సిపల్ చైర్మన్‌గా దుర్గప్పగారి అశోక్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆర్డీవో జయచంద్రారెడ్డి అశోక్‌గౌడ్‌కు మున్సిపల్ చైర్మన్‌గా నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు అశోక్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

**అధిష్టానం నిర్ణయం మేరకు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక**

**- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్‌గా అశోక్‌గౌడ్‌ను ఎన్నుకున్నట్లు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లందరూ ఏకతాటిపై నిలబడి అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు వారందరినీ అభినందించారు. ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నర్సాపూర్ మున్సిపాలిటీకి రూ.35 కోట్లు విడుదల చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ నిధులను వెనక్కి తీసుకున్నదని, తిరిగి నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీల్లోని బీఆర్ఎస్ చైర్మన్లను కాంగ్రెస్ సర్కారు లాక్కుంటున్నదని, నర్సాపూర్‌లో మాత్రం అందుకు భిన్నంగా బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరి మధ్య బేదాభిప్రాయాలు లేవని అందరూ కలిసిమెలిసి నర్సాపూర్ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

**పార్టీకి ద్రోహం చేసిన వారికి బుద్ధి చెప్పిన కౌన్సిలర్లు**

**-మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి**

గతంలో బీఆర్ఎస్ నుంచి చైర్మన్‌గా ఎన్నికై బీజేపీలో చేరిన మున్సిపల్ చైర్మన్‌కి బీఆర్ఎస్ కౌన్సిలర్లు తగిన బుద్ధి చెప్పారని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు పర్యాయాలు బ్రహ్మాండంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజల సంక్షేమం కోసమే పనిచేయాలని సూచించారు.

**మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడుతా**

**- మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్**

నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి పాటు పడుతానని నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. ఎన్నికకు సహకరించిన మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. 15 రోజుల్లో అవసరమైన పనులను గుర్తించి అమలుచేస్తామన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీని జిల్లాలోని మిగతా మున్సిపాలిటీలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. అన్ని పార్టీలు, కౌన్సిలర్లను కలుపుకొని ముందుకెళ్తానని, అందరూ సహకరించాలని కోరారు.